# అంతే మందు

★ రాజా ★

ఒకరోజు సాయంకాలంపూట నేనూ, గోపాల రావూ కాకినాడ బీచిలో కూర్చున్నాం. గోపా లరావు తన భార్యకి ఉండాల్సిన లక్షణాలన్నీ ఏ కరువు పెట్టుకు పోతున్నాడు.

"నేను పెళ్ళిచేసుకోబోయే పిల్ల విద్యా, విన యం, శాంతం ఉన్నదిగా ఉండాలి. మంచి శుభ్రమైన అలవాట్లుండాలి. ఇరవై నాలుగు గంటలూ ఇస్త్రీ చీర కట్టుకుని కళ్ళముందు మెదుల్తూ వుండాలి. ఏమాత్రం ఎడ్డి మడ్డి గుణా లుండకూడదు. ఇంక ఆ అమ్మాయి అందం సంగ తంటావా; తెల్లగా, సన్నగా, నాజూగ్గా పొడు గూ పొట్టీ కాకుండా ఉండాలి. ఆమె జడ మోకాళ్ళవరకూ వేళ్ళాడుతూండాలి. నువ్వు పువ్వులాంటి ముక్కూ, శంఖంలాంటి మెడా..."

"లిస్టు పూర్తి అయిందా ఇంకా లేదా?" అన్నాను వినడానికి ఓపిక లేక. అతను బహుశా ఏ కాళిదాసునో, దండినో కాపీ కొడ్తున్నా డేమో.

"ఆఁ, మర్చిపోయాను. పాదాలు నున్ని తంగా, చిన్నవిగా ఉండాలి; ఆమె చేతుల వేళ్ళు నాజూగ్గా, పొడూగ్గా అర్టిమ్మల వేళ్ళకి మల్లే ఉండాలి."

"వీడు వెయ్యేళ్ళు తపస్సు తలక్రిందుగా చేసినా అలాంటి అమ్మాయి దొరకడం అసం భవం" అనుకున్నాను.

* * *

మేం కాలేజీలో చదువుతున్న రోజులు వెళ్ళి పోయాయి. అతను కాకినాడలో ఉద్యోగం చేస్తూ లలిత అనే అమ్మాయిని పెళ్ళి చేసుకున్నా డని విన్నాను. నేను మద్రాసులో ఉద్యోగం చేస్తూండడం మూలాన్ని అతన్ని చూడలేక పోయాను.

బహుశా అతను తన ఆదర్శాలన్నీ మానుకుని ఏదో ఓ పిల్లని పెళ్ళిచేసుకుని వుంటాడు. అని అనుకున్నాను. కాని పెళ్ళయిన నెల్లాళ్ళకి నాకో ఉత్తరం వచ్చింది. అందులో అతను తనకి అన్నివిధాలా నచ్చినట్టువున్న పిల్లని చేసుకొన్నా నని, తనలిస్టుకి మాటకి మాట తప్పకుండా ఉందనీ రాశాడు.

నాకు నిజంగా చాలా ఆశ్చర్యం వేసింది. పోనీ, గోపాల్రావు ముసలాడయిపోయేదాకా అలాంటి పిల్లకోసం వెదకే అవసరం లేకపో యిందిగదా అని సంతోషించాను. వాళ్ళిద్దరూ "ఆదర్శ దంపతులు" అని అంతా అంటూండడం కూడా విన్నాను.

ఇలా రెండేళ్ళు గడిచాయి. ఇంతట్లో వాళ్ళ మధ్య ఏదో చిన్న చిన్న విషయాలకి చీట్లా టలూ, పోట్లాటలూ జరిగాయని విన్నాను కర్ణా కర్ణిగా. నా కతనిదగ్గిర్నుంచి ఆమెని పొగడుతూ వచ్చే ఉత్తరాలు కూడా తగ్గిపోయాయి.

గాలివార్తల మూలంగా నాకు తెలిసినదిది. మొగుడూ, పెళ్ళామూ చాలా స్వల్పవిషయంలో దెబ్బలాడుతున్నారు. ఇంతకీ తప్పెవరిదో తెలి యదు. బహుశా గోపాల్రావుదే తప్పు అని.

మూడోనాటికి గోపాల్రావు దగ్గిర్నుంచి నాకో ఉత్తరం వచ్చింది. అందులో యిలా వుంది.

డియర్ రాజా,

నేనూ, లలితా యిప్పుడు మాట్లాడుకోటం లేదు. దీనికి కారణం నేను చెప్పలేను. కాని ఊళ్లోవాళ్లందరూ దీన్నిగురించి ఏమేమో చెప్పుకొంటున్నారు.

నా అనుకున్నలిష్టంతా ఆమెలో పూర్తిగా ఉందనడంలో ఏమీ అతిశయోక్తిలేదు. కాని ఆమెలో ఏదో ఒక తీరని కొరత కనిపిస్తోంది. దాన్ని నేను మాటలో పెట్టలేకుండా వున్నాను. నా మనస్సులో సంగతి నువ్వు అర్థంచేసుకునే వుంటావు.

అందుచేత నేను ఆమెని వదిలిపెట్టి మరొకదాన్ని చేసుకునే ఉద్దేశంతో వున్నాను

ఇట్లు

గోపాల్రావు.

నేనిదిచూసి చాలా ఖంగారుపడ్డాను. వాడు తొందరపడి వాడిపెళ్లాన్ని వదిలేసుకున్నట్టయితే మనంచేసేది ఏమీ వుండదు. అంచేత వెంటనే బయలుదేరి వస్తున్నాననీ, ఈలోపుల తానేవిషయంలో ఏమీ జోక్యం కలిగించుకోవద్దనీ టెలిగ్రాం కొట్టి, మర్నాడే కొద్దిపాటి సామానుతో వాడు ఉద్యోగం చేస్తూన్న యింటికి వెళ్లాను. నన్ను చూసి భార్యాభర్త లిద్దరూ ఎంతో భారం తొలిగిపోయినటుగా సంతోషించారు.

లలిత ఆధునికంగా అలంకరించుకుని వుంది. సన్నగా, నాజూగ్గా ఉన్న దేహం, శంఖంలాంటి మెడా, మోకాళ్లదాకా జడా, చిన్నపాదాలూ, పొడూగ్గా నాజూగ్గా ఉన్న వేళ్లూ—అంతా ఒక్క పొల్లయినా పోకుండా సరిగ్గా గోపాల్రావు చెప్పినటుగానే వుంది. నేనిదిచూసి చాలా ఆశ్చర్యపడ్డాను.

నేను గోపాల్రావుకి ఎన్నో రకాలుగా నచ్చచెప్పాను. "ఏరి కోరి పెళ్లిచేసుకోడమేమిటి? అర్ధాంతరంగా వదిలిపెట్టి మరొకదానికోసం దేవుళ్లాడమేమిటి?" అని, కాని గోపాల్రావు మటుకు మూర్ఖంగా, "ఎమైనా సరే నేను వదిలిపెట్టక మానను" అని మంకుపట్టు పట్టుకు కూర్చున్నాను,

నేను లలితని అడిగాను ఎమిటి కారణం" అని కాని ఆమెకూడా మొహం ముడుచుకు కూర్చోటమే తప్ప జవాబు చెప్పలేదు.

"నువ్వు చాలా అదృష్టవంతుడివనే సంగతి గ్రహించుకోలేక పోతున్నావు" అన్నా చివరికి.

"నువ్వు చెప్పింది నిజమే" అన్నాడు గోపాల్రావు.

"మరి, అయితే నీ దృష్టిలో నువ్వు ప్రేమించిన, లేదా ప్రేమించానని అనుకుంటున్న మరో పిల్ల ఎవరన్నా వుందా?"

"ఆ, ఉంది."

నాకు "తినగా తినగా గారెలు చేదు," అన్న సామెత జ్ఞాపకం వచ్చింది. తనుకోరుకున్న స్వప్నసుందరి ఈవాళ వాడి కళ్లముందు నిరంతరం కనిపిస్తూండడం చేతనేగా ఈ నిర్లక్ష్యత!

గంటసేపు మాట్లాడి ఎల్లా అయితేనేం వాణ్ణి ఓ సంగతికి ఒప్పించాను. లలిత నాతోకూడా వచ్చి మా ఆవిడతోపాటు కొద్ది నెల్లు వుండేట్టూ గోపాల్రావు మటుకు ఆ కొత్తమ్మాయి వెంటబడి ఆమె తనకి అర్హురాలో కాదో కొన్ని పరీక్షలు చేసేట్టూ ఒప్పించి, నాతో చెప్పందే అతను పెళ్లిచేసుకోకూడదని వాడిచేత ఒట్టుపెట్టించుకున్నాను.

గోపాల్రావు ప్రకృతి నాకు బాగా తెలుసు. అనుకున్నదల్లా గుడ్డిగా ఆచరించే రకంకాదు అతను. అందుచేత కొంతకాలంపాటు అతన్నీ, భార్యనీ దూరంచేసినట్టయితే, అతనికోపం ప్రకృతి సిద్ధంగా చల్లారి, మళ్ళీ దారిలోకొస్తాడనే ఉద్దేశంతోనే లలితని మా యింట్లో ఉంచాను.

అయితే నాకొంచెం అనుమానంగానేవుంది. అతనిప్పుడు కాకినాడలో ఒంటరిగా వున్నాడు. పెళ్లామా దగ్గరలేదు. ఇందుమూలంగా అతను పెళ్లాన్నే మర్చిపోతేనో? ఏమైనా విరిగితే అత

చ్చుగాని మనస్సు విరిగితే అతక లేమన్నారు. యింతకీ ఏం జరగనుందో?

గోపాల్రావుకి ఈ తల తిక్కకి ఏమిటి మందు? చివరికి ఒక ఉపాయం పన్ని వాడికో ఉత్తరం రాసేశాను.

డియర్ గోపాల్రావ్;

నీ దగ్గర్నించి బొత్తిగా ఉత్తరాలు రావటం లేదు. కారణం తెలియదు.

నీకూ, ఆ కొత్త అమ్మాయికీ మనస్సులు బాగా కలిశాయనుకుంటాను.

నీకుమల్లేనే లలితకూడా మరో పెద్ద మనిషిని చూసుకుంది. వాడూ పరాయివాడు గాడు; మా పింతల్లి కొడుకే. 'మా యిద్దరి హృదయాలూ ఒకే తీగకి స్పందిస్తున్నాయి', అని చెప్పిందో రోజున లలిత అతనుకూడా మంచి హోదాలో ఉండేడే కాకుండా, అందంలో లలితకి మించి వున్నాడు.

లలిత ఇప్పుడు అతన్ని పెళ్ళిచేసుకోంటానంటోంది. అతనూ సిద్ధంగానే ఉన్నాడు. కాని కొద్దిరోజులపాటు వాళ్ళిద్దరూ ఒకళ్ళ నొకళ్ళు పూర్తిగా అర్థంచేసుకునేదాకా నేను అనుమతి యియ్యదలుచుకోలేదు.

నీకూ, ఆ కొత్త అమ్మాయికీ నా అభినందనాలు.

ఇట్లు
రాజా

* * *

ఆ ఉత్తరం పోష్టుగా పడేశాక నాకొక మోస్తరు ఆశ లేకపోలేదు. కాని యిలా అవుతుందని నేనెన్నడూ అనుకోలేదు.

ఏమంటే మూడో నాటి సాయంత్రానికల్లా గోపాల్రావు పెట్టె, బెడ్డింగూ బుచ్చుకుని మెడ్రాసుకి తయారయ్యాడు. అతని చేతులు వణుకుతున్నాయ్; ముచ్చెమటలు పోస్తున్నాయ్; మొహంలో చాలా ఆత్రం కనిపిస్తోంది.

"యింకా చెయ్యిదాటి పోలేదుగదా? అన్నాడు కంగారుపడుతూ.

నేను గోపాల్రావుని ఏడిపిద్దామని, "సరేగాని నీకూ, ఆ కొత్త అమ్మాయికీ బాగా పొసగుతోందా? అన్నాను,

"ఛీ ఛీ, అమాటే చెప్పకు. నయం. ఇంకా చేసుకోలేదు. ఆ అమ్మాయి దగ్గరున్నన్ని అలిగే గుణాలు ఎవరిదగ్గిరా వుండవనుకో,

"కాని ఆమె ఎంత ఆకర్షణా, ఎం సంగతీ."

"చాల్లే ఎవరన్నా నవ్వి పోతారు. బంగారం లాంటి లలితకి ఆ వెధవ మొహానికి తీసుకొచ్చావు సాన్యం. నేను ఆలస్యం చెయ్యలేదుగదా... ఏడీ మీ...మీ బంధువు?

"అతనిప్పుడే లాయర్ని చూడ్డానికి వెళ్ళాడు, భర్త వొదిలిన ఒక యువతిని పెళ్ళిచేసుకునే విషయం మాట్లాడ్డానికి,

ఇది విన్నాక అతని మొహంలో కనిపించిన ఈర్ష్య చూసి నాకు నవ్వొచ్చింది.

"వాడి పీక పిసికేస్తా అల్లాంటి ప్రయత్నం ఏమన్నా చేశాడంటే అన్నాడు వాడు,

యింక అతన్ని ఏడిపించడం చాలించి, లలితని పిలిచాను, లలిత ఓ కుర్చీ దగ్గిరికి లాక్కుని కూచుంది.

"చూశావూ, నేనెంతో కష్టపడి లలిత మా వాణ్ణి పెళ్ళాడకుండా ఆపాను, నీ అదృష్టవశాత్తూ లలిత నా మాట వింది, అది ఎంత కష్టమై పోయిందో నువ్వు ఊహించుకో, నువ్వు కాపీ తీసుకుని మావాడు రాకముందే ఉడాయించు ఈసారి నువ్వేమన్నా పడదు లలిత, జాగ్రత్తగా మసులుకో, అని హెచ్చరించాను,

వచ్చినవాడు వచ్చినట్టే మా ఆవిడ తెచ్చిన కాఫీయేనా ముట్టుకోకుండా పరిగెత్తాడు లలితతో,